# వింత జంట

శ్రీ యం. సోమ్.

ఉషఃకాలం - భానుడు తన అరుణారుణ కిరణాలను వెదజల్లుతూ, నీలి మబ్బులోంచి పొంచి చూస్తూ "మరల రేపు వస్తాను సెలవు" అంటూ అస్తమిస్తున్నాడు. చిత్ర కారుని బొమ్మలకు అవసరమైన రంగులన్నీ ఆ ఆకాశంలో మిళితమై కనిపిస్తున్నాయి. కవి వర్ణనకు పుట్టిల్లయిన పకృతి ప్రశాంతాన్నందిస్తూంది. ఆ సాయంత్రపు సూర్య కిరణాల్లో మెరసిపోతూన్న సముద్రపుటొడ్డున పిల్ల వాయువులకు అల్లల్లాడే ముంగురులను చక్కబెట్టుకుంటూ అందం, ఆనందం అంతా తమదే అనుకుంటూ మురిసి పోయే యువతులు, స్వేచ్ఛ అంటే యింకెక్కడుందంటూ చేయి చేయి కలిపి తిరిగే యువకులు, కుక్కలతో ఆడుకునే పిల్లలు, పిల్లలతో ఆడుకునే తల్లులు, తల్లులతో బాధపడే కూతుళ్లు, కూతుళ్ళతో విసుగుచెందే తండ్రులు, 'ఆమె నన్ను చూడలేదే!' అని అలమటించే అమాయకులూ, అల్లరిచేసి ఆనందించే అంగనలు, మమత మాల మనసు మెరపుల మురిసిపోతూ పొంచి చూచే పూబోండ్లు, వీరి చర్యలను చూస్తూ ఆనందించేవారు కొందరు - విసుగు చెందే వారు మరికొందరు, ఒకవైపు 'వేరుగళ్' కుర్రవాని కేకలు, మరొక వైపు ఐస్క్రీమ్ అమ్మేవాని అరుపులు, కాకుల కోలాహలం, కుక్కల అరుపులు వీటన్నిటికీ స్మృతి పోస్తూన్నట్లు సముద్రపు ఘోష. ఇసుకలో కూరుకు పోతూన్న కాళ్ళను ఈడ్చుకుంటూ ఆ రమణీయాన్ని గురించి పొగడుతూ నా ప్రక్కనే నడుస్తూ వస్తూన్న స్నేహితునివైపు తిరిగాను. అంతవరకూ నా వెంట వస్తూ అంత అకస్మాత్తుగా ఎక్కడ ఆగిపోయాడా అని వెనక్కి తిరిగి చూశాను. మన వాడు కొన్ని గజాల దూరంలో ఎవరితోనో మాట్లాడుతూ నవ్వుతూ నన్ను రమ్మని పిలిచాడు. తరువాత వారికి నన్ను, నన్ను వారికి పరిచయంచేసి వారితో యింకా ఏమో మాట్లాడుతూనే వున్నాడు. మన వాడితో మాట్లాడుతూన్న యువకుని మాటల్లోని ఆప్యాయత, ఆ చూపుల్లోని శాంతం నన్ను మరీ ఆకర్షించాయి. అతని ప్రక్కనే కూర్చొని పొంగి పొరలే ఆనందంతో తన చిన్న బిడ్డను ఆడిస్తూ మాతృ హృదయాన్ని వెల్లడిస్తూంది అంగ సౌష్టవంతో కూడుకున్న షుమారు పదునెనిమిది సంవత్సరాల అందాల భరిణి. బంగారు ఛాయలాంటి ఆమె శరీర చ్ఛాయ, నల్లని దీర్ఘమైన రెండు జడలు, మెరసిపోయే నేత్రాలు, చిలుక పలుకల్లాంటి ఆ మాటల్లోని పొదుపు అంతా ఆమె ఎవరో చిత్రకారుని చిత్తరువో, కవుల ఊహా స్వరూపమో అన్నట్లుంది. వారిరువురి మధ్య చిన్న చిన్న అడుగులతో అల్లి బిల్లి తిరిగే చిన్న పాప - చూడటాని కెంతో ముచ్చటగా ఉంది.

ఆలా చూస్తూన్న నన్ను మన వాడు నా చెయ్యి పట్టుకొని "చెప్తాన్నడు" అంటూ బయలుదేరాడు. మరేం చెయ్యను. "సరే" నని నడక సాగించాను. అలా నడుస్తూనే మనవాడు ఆ జంటను గురించి చాలా వింత వింత విషయాలు చెప్పటం ప్రారంభించాడు. అలా చెప్పుకుంటూ మెల్లగా రూము చేరాము. ఏ నిమిషాన్ని చూసినా ఆ ఆదర్శమైన జంటే గుర్తుకు వస్తూంది. ఒక్కొక్కరి మనస్తత్వాన్ని గురించి-అందులో స్త్రీలను గురించి ఎన్నో రకాలుగా ఆలోచించాను. కాని స్త్రీ హృదయాన్ని అర్ధం చేసుకోవటం అంత సులభమైనది కాదేమో! ఒకప్పుడు ఆనందాన్ని చేకూర్చిన స్త్రీయే మరొకప్పుడు అశాంతి నిస్తుంది. అమృతాన్ని వెదజల్లే అబలే విషాన్ని కురిపించే కర్కసిగా మారుతుంది. ఒక క్షణంలో తన ప్రేమ హృదయాలయ సింహద్వారాన్ని తెరచి పూజారి నాహ్వా నిస్తుంది. మరుక్షణంలోనే కవాటాలను బంధించి పిశాచాల

కాలయమైన శ్మశానంగా మారుస్తుంది. తన సంతోషానికై మరికొందర్ని బాధలకు గురి చేస్తుంది. మరొకరి ఆనందం కొరకు తాను కష్టాల నెదుర్కొంటుంది, వెన్నపూసలాంటి మనసు కఠినశిలగా మారుతుంది. చలనంలేని హృదయాన్ని వూరికే చలింప జేస్తుంది. ఏమిటీ మార్పు! ఇలా ఏమో ఆలోచిస్తున్నానే కాని అసలా జంట కథ ఎక్కడ ప్రారంభించి వ్రాసి మన వాడి కోర్కె తీర్చాలో బోధ పడింది కాదు. పోనీ శుభమస్తూ అని పెండ్లితో ప్రారంభిద్దా మనిపించింది. సరే అనుకున్నాను.

ఈ పెండ్లిండ్ల విషయాలు చూశారూ మహ వింతగా ఉంటాయి. అది మానవ సృష్టిలోని కీలకమే అనుకోండి, మరేమైనా అనుకోండి. కాకపోతే ఎక్కడో పెరిగిన అబ్బాయికి, మరెక్కడో పుట్టిన అమ్మాయికి పెండ్లి. పెండ్లంటే చిన్న దగ్గర నుండి పెద్ద వరకు సంతోషమే. ముఖ్యంగా చావటానికి సిద్ధంగా ఉన్న వృద్ధులకు మరీను. ఈ వృద్ధుల తాలూకు పెండ్లీడు పిల్లలు ఎవరైనా ఉంటే వీళ్ళ పోరు పడటం మాత్రం చాలా కష్టం. ఆ పిల్లల పెండ్లయితే చూసి మరీ ప్రాణాలు వదుల్దామని. వీళ్ళ పెండ్లికి వాళ్ళ చావుకు ఏమిటో సంబంధం!

రమణ కుటుంబంలో అలా పెండ్లికని పోరు పెట్టే వాళ్ళు చాలామంది ఉన్నా రమణ మాత్రం వారి మాటలు చెవినిపెట్టకుండా కాలేజీ చదువు సాగిస్తున్నాడు పట్టణంలో. కుమారుని పట్టుదలకు విసిగి విరక్తి చెందిన నాన్నగార్కి అకస్మాత్తుగా ఒక జాబు వచ్చింది. దాన్ని చదివేటప్పటికి తనకే కాకుండా ఆ యింట్లో వున్న అందరికీ గుండె ఆగి పోయినంతయింది ఆనందంతో. తలవని తలంపుగా తన ముద్దు బిడ్డలో అంత మార్పు ఎందు కొచ్చిందో తెలియని వెర్రి తండ్రి ఆ ఉత్తరాన్ని మరల మరల చదువుకున్నాడు. తన ఏకైక పుత్రుని పెండ్లి విషయంలో తాను ఏసంబంధం తెచ్చినా ఒప్పుకుంటానని వ్రాయటం వల్ల పొంగి అప్పుడే పెండ్లయినంత ఆర్భాటం చేశారు. రోజూ నాలుగు సంబంధాలు చూస్తున్నారు. రమణంటే అన్నివిధాలా మంచివాడు. అందులో కాస్తో కూస్తో స్థితిమంతుడు. మరేం కావాలి! చివరకు ఏదో ఒక దూరపు సంబంధాన్ని నిర్ణయించటం, వెంటనే రమణని పెండ్లి చూపులకని కబురుచేయటం. అతను రాగానే అందరూ కలిసి వారి సాంప్రదాయ ప్రకారంగా వధువును చూడటానికని వరుడు వధువు ఇంటికి కాకుండా వారికి వీరికి బంధువులైన మరొక రింటికి వెళ్ళారు. ఇటునుండి వీళ్లు చేరుకునే టప్పటికి రాత్రి చాలా ప్రొద్దు పోవడం వల్ల ఆ రాత్రి కేదో లోకాభిరామాయణం మాట్లాడుకొని పుణ్యకాలం కాస్తా గడిపారు. ఆ యిల్లు వధువు పిన తండ్రిగారి యిల్లు. ఆ యిల్లు, దాని వెనుక దొడ్డి, దానిలో బావి, ఆ ప్రక్కనే వున్న పూల మొక్కలు, ఆ యింటి స్థితి సాధారణమైందని తెలుపుతూంది.

ఆ మరునాటి ఉదయాన్నే స్నానం ముగించుకొని ఒళ్లు తుడుచుకుంటూ ఆ బావి దగ్గరే ఏదో ఆలోచిస్తూ నుంచున్నాడు రమణ. అతనిలో ఉత్సాహం ఏమూలా కనిపించటంలేదు. మనసు లేని మరలాగ ప్రక్కన వారు చెప్పిన దల్లా చేస్తున్నాడు. ఎలాగైనా సరే, ఏమైనా సరే తల్లిదండ్రుల కోర్కె తీర్చటానికనే ఆ పెండ్లి కొప్పు కున్నాడు — అంతే. ఆ కోర్కెతోనే పిల్లను విధాయికంగా చూడాలన్నట్లు వచ్చాడు. తన అమూల్యమైన ఆశయాలన్నీ ఏనాడో అడుగంటి పోయాయి. అతనిలోని ప్రేమజ్యోతి ఆరి సన్నని పొగ మాత్రం వస్తూంది. అతని హృదయం ప్రస్తుతం అద్దెకొంపలాంటిది - అంతే. వెలుకట్నాలిచ్చి తన హృదయాన్నాక్రమించు కోవటానికి ముక్కు, మొగము తెలియని యువతి వస్తోంది, ఆ వచ్చే ఆవిడ తన జీవితపు తోటలో విష బీజాల్ని నాటుతుందో! ప్రేమ మొక్కల్ని పెంచుతుందో! ఎలా తెలుస్తుంది?

ఏమైనా సరే ఆ పెండ్లికి ఒప్పుకున్నాడు తాననుకున్నది తనకు కానప్పుడు మరొకటేదైతేనేం? అందుకే ఆకాబోయే భార్య ఎవరో? ఏమిటోగూడా తెలుసుకోవటానికి ప్రయత్నించలేదు. ఏదో ఆలోచనతో అలాగే సూన్యంగా అచ్చటి పూలమొక్కల్ని చూస్తూ కూర్చున్న అతని కండ్లు వున్నట్లుండి ఒక్కసారిగా మెరిశాయి. ఆ పూలచెట్లమధ్య మెరపుతీవిలాంటి యువతి చిన్న పిల్లని వెంటబెట్టుకొని చెట్ల పాదులను బాగుచేస్తూంది. ఆ యువతి ఇతన్ని చూడ కుండగనే తన పని తాను చేసుకుంటోంది. ఆ యువతి ముఖం మాత్రం అతనికి కనిపించటంలేదు గాని - ఆమె నడకని - ఆ వాలుజడని చూడగానే ఇతని గుండె దడ ఆరంభమయింది. ఆవిడే పెండ్లికూతురేమో అనుకున్నాడు. మరలా పెండ్లికూతురైతే అలా చెట్ల పాదుల్ని బాగుచేస్తూ వుంటుందా - హాయిగా ముస్తాబై ఏ గదిలోనో కూర్చో వాలిగాని. అయినా ఏమో - అనే అనుమానం. ఆమె ముఖాన్ని చూడగానే తీరిపోయింది. ఏదో గుర్తుకు

వచ్చింది — తన్ను చూడగానే రాతిబొమ్మలాగ నిల్చిపోయిన ఆమెను మరల చూడలేకపోయాడు. పెదవులు వణుకుతున్నాయి. అవమానంతో తలవంచుకొనిపోయింది అపరాధమన్నట్లు శరీరం కంపించింది. భయంతో కళ్ళు మూసుకొనిపోతున్నాయి. సిగ్గుతో కాళ్ళు పరుగెత్తుతున్నాయి, ఎందుకో? అలా గబగబా తనకని నిర్ణయించబడిన రూములోకి వెళ్ళాడు. నాన్నగారి ద్వారా పెండ్లికూతురు ఆవిడేనని తెలుసుకొని విలపించటం మొదలుపెట్టాడు. ఆరోజు తన ఆశలన్నీ అడుగంటినరోజు - తన ప్రశాంత జీవితంలో పెనుతుపాను రేగిన రోజు గుర్తుకు వచ్చింది. ఏదో చెప్పలేని బాధ తన హృదయాన్ని దహించివేస్తోంది. "ఆమెతో పెండ్లి వద్దంటే వద్దని" నాన్నగారితో చెప్పాడు. ఇంకేముంది? అంతవరకూ ఆనందంలో మునిగి తేలుతున్న నాన్నగారికి చాలా అన్యాయం జరిగింది. రమణకు పిచ్చేమైనా పట్టిందేమో! అనే అనుమానం ఆవరించింది. కాకపోతే అంతవరకూ వచ్చిన తరువాత అలా అంటాడా? పోనీ పిల్లేమైనా నచ్చలేదనుకోవటానికి అలాగేం లేదు. మరయితే అంత అకస్మాత్తుగా ఏమిటా మార్పు? పైపెచ్చు తానేదో అపరాధం చేసినట్లు భయపడుతున్నాడు. అంతా అయోమయంగా వుంది. ఈ విషయమంతా ఒక్క క్షణంలో ఆ యిల్లే కాకుండా ఆ వీధి అంతా ప్రాకిపోయింది. నలుగురూ నాలుగు విధాలా అనుకోవటం ప్రారంభించారు.

ఈ విషయాలన్నీ వింటున్న రాధ తన పెండ్లి పచ్చడి మెతుకులుగా మారినా, పాయసాన్నం తింటున్నట్లే ఆనందిస్తూంది. తన కన్నివిధాలా తగిన వరుడు తన్ను పెండ్లాడటానికి నిరాకరిస్తుంటే ఆవగింజంతైనా విచారించదు సరిగదా ముందెన్నడూలేని సంతోషంతో వికసిస్తూ, పరిమళాన్ని వెదజల్లుతూంది. ఏమిటీ వింత ప్రవర్తన? అతనికి బాధ — ఈమెకు సంతోషం—

ఆమెకు తెలుసు- అతనెవరో? ఎందుకలా బాధపడుతూ పెండ్లి వద్దంటున్నాడో? వారి వింత ప్రవర్తనలకి అందరూ తికమక అవుతున్నారనీ తెలుసు — ఎవరెలాపోతేనేం?- ఏదెలా జరిగితేనేం? తన సంతోషానికి అతనే కారణం - అతని విచారానికి తనే కారణం- ఆ హృదయ పరిచయం.... ! బావిదగ్గర చూసినప్పుడే అతని వింత ప్రవర్తన గ్రహించుకుంది. అతనెంతగా ఖిన్నుడై వుంటాడో గ్రహించుకుంది. అప్పుడే మాట్లాడదామనుకున్నా అవకాశం లేకపోయింది- అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది-

ఏ సుందరమూర్తిని దర్శించి- తన తప్పును క్షమించమని ప్రాధేయ పడటానికి పడరాని పాట్లు పడిందో- ఏ శాంతమూర్తికి తోడుగా నిలచి కళామతల్లికి వన్నెలు దిద్దుదామనుకుందో- ఆ కళా పిపాశినే- దైవం, తన భర్తగా చేకూరుస్తున్నాడంటే ఆనందం గాక మరేముంటుంది? ఆ ఆనందంతోనే రమణ వద్దకు నడుస్తూంది—కాని- ఆనాటి సాయంత్రం - ఆ నవ్వులు - అవమానంతో క్రుంగిపోతున్న యువకుడుకి అన్నీ గుర్తుకు వచ్చాయి. శరీరమంతా ఒక్క సారిగా వణికింది. తన చేతిని ఒక్కసారి చూచుకుంది. అదే చెయ్యి ఆరోజు- అబ్బా! ఆ చేతిని రెండు ముక్కలుగా నరికి ఆ రక్తాన్ని అతని కాళ్ళ ముందు ధారపోసి క్షమాపణ కోరుకుందామనుకుంది. అలా ఆలోచిస్తూనే అతని రూములోకి ప్రవేశించింది. అంతవరకు ఏదో ఆలోచిస్తూ మరో లోకంలో వున్న రమణ ఈమె రాకతో యధాలోకంలోకి వచ్చాడు. ఆలోచిస్తున్న అతని కాళ్ళవద్ద అలాగే కూర్చొని జాలిగా అతని ముఖంలోకి చూసింది, తప్పు క్షమించమన్నట్లు. అతనిలో అంతవరకూ అలుముకొస్తున్న ఆవేదన ఆనందంగా మారింది. పడిపోయిన ప్రేమసౌధాల్ని మరల గట్టిగా కట్టుకోవటానికి చేయి చేయి కలుపుకున్నారు. ఒకరి కన్నీరు మరొకరు తుడుచుకున్నారు. అలా ఒక్క క్షణకాలంలో స్వర్గాన్ని నిర్మించుకున్నారు.

ఇదంతా చూస్తున్న అచ్చటి బంధుకోటికి నిజంగా పిచ్చపట్టినంతై "కలయో వైష్ణవ మాయయో" అన్నట్లు ఆపిచ్చలోనే పెండ్లి చేశారు. వాళ్ళ పెండ్లయితే మహా వైభవంగా జరిగింది గాని- వీళ్ళకి పిచ్చమాత్రం యింకా వదలక చెవులు కొరుక్కుంటున్నారు. నిజమే, రమణా-రాధల విషయం వీళ్ళకేం తెలుసు? తెలిసిన స్నేహితులు కొందరు మాత్రం చాలా సంతోషించారు.

అలా సంతోషంతోనే కొన్నాళ్ళు గడిపారు. ఇప్పుడు రమణ వుద్యోగంచేస్తూ హాయిగా పట్టణంలో కాపురం చేస్తూ వీలున్నప్పుడల్లా తన లలిత కళలకు వన్నెలు దిద్దుతూ కాలం గడుపుతున్నాడు, ఆ దంపతుల ప్రేమ ఫలితంగా పుట్టిన ముద్దుబిడ్డ పుట్టిన రోజు పండుగకు తమ స్నేహితుల నందర్నీ పిలిచారు. వచ్చిన అందరూ

పొగడటం - దీవించటం అంతా జరిగిపోయింది. రాధ స్నేహితురాండ్రు ఆమె ముద్దు బిడ్డని ఎత్తుకొని ఆడిస్తున్నారు. కాని బిడ్డ మాత్రం తల్లి కొరకని ఏడుస్తూ, వారి చేతుల్లో నిలువకుండా ప్రళయ తాండవం చేస్తున్నాడు. దానితో పాపం రాధ తాను తన స్నేహితురాండ్ర కిచ్చిన ఆనందం, తన చంటిపాప యీయటంలేదే! అన్న కోపంతో స్నేహితురాలి చేతిలోని బిడ్డను తీసుకుంటూ "చెంప పగులకొడితే సరి" అన్నది తల్లి ప్రేమతో. ఆమాట వినగానే వారికి కొంత దూరంలో స్నేహితులతో కూర్చొని కాఫీ తీసుకుంటున్న రమణచేయి తన చెంప మీదకు పోయింది ఏదో గుర్తుకువచ్చి. అది గమనిస్తున్న అచ్చటి వారికి ఈ సంఘటన చిత్రంగా తోచింది. ఏమిటి ఈమె మాటలకి- అతని చేతలకి సంబంధం? అదే ప్రశ్న అందర్నీ ఎదుర్కొంది. ఉండబట్టలేని తెలిసీ తెలియని ఒకావిడ ఆ సంబంధాని గురించి రాధని ఏకాంతంగా? పిలిచి అడిగింది. తాను గూడా ఎవరికో కాబోయే భార్య గనుక, ఆమర్మమేదో తెలుసుకుంటే, అవసరమైతే వుపయోగించుకుందామనే ఆశతో—— రాధకి చెప్పటం తప్పనిసరై దీర్ఘంగా నిశ్వాశించి చెప్పడం మొదలుపెట్టింది.

"అవి నేను మద్రాసులో చదువుకునే రోజులు. ప్రతీ రోజూ సాయంత్రం మా నాన్నగారు, అమ్మగారు, నేనూ బీచికి వెళ్ళే వాళ్ళం. ఎన్ని పనులున్నా బీచికి పోవటం తప్పనిసరయింది. మేము బీచికి వెళ్ళినప్పుడల్లా మాకు సమీపంలో ఎవ్వరో కూర్చొని వుండేవారు ఏకాంతంగా. ఆ వ్యక్తి ప్రతిరోజూ అదే స్థలంలో కూర్చోవటం జరుగుతూండేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి——కాని మా నివాస స్థలంలో మాత్రం ఏమీ మార్పుండేది కాదు. ఆ వ్యక్తి మా కొరకు అక్కడ కూర్చుంటున్నాడో, ఆ వ్యక్తి కొరకు మేమక్కడ కూర్చుంటున్నామో బోధ పడేదికాదు. ఆ వ్యక్తిని చూస్తున్నకొద్దీ నాకు వింత వింత ఆలోచనలు వస్తూండేవి. ఆ ఏకాగ్రత, ఆ ఆలోచన, ఆ వాలకం చూస్తూంటే అతనెవరో పకృతినారాధించే చిత్రకారుడో, లేక కవియో అయివుంటాడనుకునేదాన్ని. ఎందలో ఆ బీచిలో కనుపించేవారు. కాని నా దృష్టిమాత్రం వారందర్నీ తప్పుకొనే ఆ వ్యక్తి మీదకే పోయేది. అమ్మ, నాన్న ఏవో పిచ్చా పాటీ మాట్లాడుకుంటూంటే, నేనూ మాట్లాడుతూ, రోజూ వున్న అలవాటు ప్రకారంగా వీలు జూచుకొని అతని వైపు చూశాను- ఇంకేముంది! దొంగ ఎంతసేపటినుండి నన్ను అలా తొంగి చూస్తున్నాడోకాని, నేను చూచేటప్పటికి దృష్టి మార్చాడు పెద్ద మనిషిలాగ. ఏం? నేను మాత్రం తక్కువ తిన్నానా? నేను చూస్తూంది గూడా అతన్ని కాదన్నట్లు దృష్టి మార్చాను సీరియస్‌గా.

"అలా చూపు మార్పులతో కాలచక్రం మరి కొంచెం తిరిగింది. నాకెప్పుడూ అతన్ని చూడాలనిపిస్తుండేది. అతని చర్యల్ని బట్టి చూస్తే అతనికి నన్ను చూడాలని వున్నట్లు అర్థమయ్యేది. ఆ కోర్కె నాలో ఎందుకు తలెత్తిందో నా కర్థమయ్యేదికాదు. ఎంతోమంది యువకుల హృదయాల్ని ఆరాటపెట్టిన నా హృదయం అతన్ని గురించి ఎందు కారాట పడాలి? ఏమో! నా పట్ల అతనూ అలాగే బాధపడుతున్నట్లు గ్రహిస్తుండేదాన్ని- ఎప్పటి కప్పుడు అతనెవరో, ఏంచేస్తుంటారో? ఎక్కడున్నారో? తెలుసుకోవాలనే కోర్కె కలగటం- అవకాశంలేక ఆరాట పడటం జరుగుతూండేది అతను నన్ను ఎంతో ఆప్యాయంగా చూస్తూండగా చాలా సార్లు చూశాను. ఏ రోజైనా అతను బీచికి రావటం ఆలస్యమైందంటే మానాన్న, అమ్మ చెప్పే మాటలేవీ బుర్రకెక్కేవి కావు. ఏదో ఆశతో ప్రతి రక్తనాళం అతని కొరకు తహ తహ లాడేది. నా పరధ్యాహ్నానికి నాన్న, అమ్మ అప్పుడప్పుడు కారణం అడగడం నేను ఏదో సమాధానం చెప్పడం అలవాటయి పోయింది. నా వింత ప్రవర్తన కొందరు స్నేహితురాళ్లు కనిపెడుతున్నా- పాపం ఎందుకో అందరూ మౌనంగానే వుండేవారు. అతని నిర్మలమైన చల్లని చూపులు- ఆ చిరునవ్వులే, అలా అందర్నీ మార్చివుంటాయనుకున్నాను. రోజు రోజుకు- అతన్ని గురించి ఆలోచించుకునేదాన్ని. ఆ ఆలోచనలోని ఊహలు తారాపథాన్ని అందుకునేవి- ఆ వూహల్లోనే ఒకటి నాబుర్రలో మెరసింది. వెంటనే అతనికొక వుత్తరం వ్రాద్దామని- దాన్ని రహస్యంగా అతనికి ఇవ్వాలనే కోర్కె కొద్దీ వుత్తరం వ్రాయటం ప్రారంభించేనేగాని, ఎలా వ్రాయాలో, ఏమని వ్రాయాలో తోచిందికాదు. అలాంటి వుత్తరం వ్రాయటం అదే మొదటి సారి అవటం వల్ల కాబోలు- పట్టుదలతో చెయ్యి వ్రాద్దామన్నా, మనస్సు వెనక్కి లాగుతోంది సిగ్గుతో- ఎలా గైతేనేం చివరకి వ్రాయటం ప్రారంభించాను.

"శ్రీ..........

- మీరెవరు? ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు? మీరు రోజూ నన్ను చూడటం.... అసలు మీకు వివాహం....

ఇంతలోనే, సిగ్గు నా హృదయంలో ఎక్కువ భాగం ఆక్రమించుకోవటం వల్ల నడక ఆగిపోయింది పాపం- సిగ్గుని ప్రతిఘటించి కలం నా పేరును మాత్రం వ్రాయగలిగింది. ఆ ఉత్తరాన్ని అతి జాగ్రత్తగా అతని ముందు పడవైచి, ఏమీ తెలియనట్లుగా మా అమ్మ, నాన్నగారి ప్రక్కన వచ్చి కూర్చున్నానేగాని నామనస్సు మాత్రం ఏమేమో ఆలోచిస్తోంది. అలా వుత్తరం వ్రాయటం వల్ల చులకనై పోతానేమో ననే అనుమానం, వెంటనే అతనెప్పుడూ అలా చూడడనే ధైర్యం- అమ్మా, నాన్నకు తెలుస్తుందేమోననే భయం- అయినా నచ్చజెప్పవచ్చుననే విశ్వాసం. ఇలాఆలోచన పరంపరల్లో నుండి తేలుకొంటున్నానో లేదో, యింతలోనే నా రెండు కండ్లు అతని వైపు తొంగి చూచాయి. ఎంతో ఆప్యాయంగా అతను వుత్తరాన్ని ఇసుకలోనుండి తీసుకున్నాడు. వుత్తరాన్ని చదివి ఏం గ్రహించాడో గాని, తిన్నగా నవ్వుకున్నాడు. మా నాన్నగారి మాటలు నాదృష్టిని మరల్చాయి. తరువాత ఇంటికి వెళ్ళేటప్పుడు వెనుకగా నడుస్తున్న నాముందుకి ఇసుకతోసహా కాగితం ముక్క పడింది. వెంటనే దాన్ని మరొకరి కంట పడకుండా నా పరుసులో భద్రపరచాను. రూములో కూర్చొని సావకాశంగా చదువుకుందామనే ఆత్రుత నాకు మా యింటిని చాలా దూరం చేసింది. ప్రతి నిముషమూ లెక్కపెట్టుకుంటూ ఇల్లు చేరాను. రూములో ఎంతో ఆత్రుతతో ఆ కాగితాన్ని విప్పి చూచాను- అంతా అయోమయం - అది నేనిచ్చిన కాగితమే- అన్నీ ఆ అక్షరాలే- నేను వ్రాసిన దస్తూరే - ఇదేమిటి నా ఉత్తరాన్ని మరలా నాకే యివ్వట మేమిటి? అనుకున్నంతా అయింది. ఈ మగవాళ్ళంతా ఇంతే. మనంగా కోరితే తాడిచెట్టెక్కి కూర్చుంటారు. అయితే బీచిలో రోజూ నేను చూచేది మేడి పండన్న మాట? కాకపోతే ఇంతగా కోరి వ్రాస్తే....... ముందుగా హృదయావేదనని వెలిబుచ్చినంత మాత్రాన యింత చులకనయ్యేనా? పైపెచ్చు ఆ చిరునవ్వులెందుకు? అనవసరంగా ఎదటివార్ని మోసం చేయటానికి కాకపోతే- ఇలా ఏమేమో ఆలోచిస్తున్నాను. ఆ క్షణంలో అనుభవించిన బాధ, ద్వేషం, కోపం, నా జీవితంలో ఎప్పుడూ పొందలేదు. ఇదంతా ఒక లిప్తకాలం. ఆరోజే నా జీవితగ్రంథంలోని సువర్ణాక్షర పూరితమైన పుట- ఆ వుత్తరమే నాకు మొదటిది- చివరిది గూడా నేమో అనుకున్నాను. ద్వేష పూరిత హృదయంతో ఆ వుత్తరాన్ని మరలా చదివాను ఈసారి ఏదో మార్పు నా కన్నీటి తెరల్లోనుండి కనిపించి ఆశ మరల తలెత్తింది. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను. వుత్తరాన్ని మరీ మరీ చదివాను- వుత్తరం క్రింద నా పేరుప్రక్కన- ర-మ-ణ అనే మూడుఅక్షరాలు క్రొత్తగా వున్నాయి. ఎన్నిసార్లు చదివినా యింకా చదవాలనిపించేది 'రాధ, రమణ' చాలా బాగుంది. రమణ కూడా, నేనడిగిన ప్రశ్నల్నే నన్నూ అడుగు తున్నట్లు రూమంతా ప్రతిధ్వనించింది. అతనికి ఎప్పుడు, ఎలా సమాధానం ఇవ్వటమా అనే ఆలోచన ఆ ఆనందాన్ని అణచిపెట్టింది. ఆ రాత్రంతా ఆలోచనతోనే గడిపాను. ఆరోజు సాయంత్రం కొరకు ఎదురుచూస్తున్న నా వింత ప్రవర్తనకు, అమ్మ, నాన్న ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు. బీచికని ముస్తాబై, ముందుగానే వెళ్ళి కార్లో కూర్చున్నాను. తరువాత నాన్న, అమ్మగార్లతో కారు బయలుదేరింది. కారు వేగంగా వెళుతూంది. అంత కంటే వేగంగా నా మనస్సు బీచిలోని రమణ వద్దకు పరుగెడు తున్నది. అతనితో ఎప్పుడు మాట్లాడదామా? అసలు మాట్లాడటమెలాగా? ప్రక్కనున్న తలిదండ్రులు; ఏంచేయాలి? ఈ ఆలోచనల్లో తలవంచుకొని పోయింది. ఈ ఆలోచనలే కారు చక్రాలు గాలికంటే వేగంగా అల్లిబిల్లి తిరుగుతున్నాయి అలా కారు చక్రాలు ఎంత దూరం దొర్లాయో గాని, నా ఆలోచనలకీ, కారు వేగానికీ ఒకే బ్రేక్‌లాగా డ్రైవరు కారు నాపాడు. దానితో నావూహా ప్రపంచంలో నుండి వూడి పడ్డాను. ఇంకే ముంది; బీచీలేదు; రమణ లేదు ఒక సినిమా థియేటరు- అప్పుడర్థమయింది, మేము సినిమా చూడటానికి వెళుతున్నామని. ఎన్నడూ లేనిది ఆరోజున సినిమాకి వద్దనటం- చాలా ప్రశ్నలకి జవాబియ్యవలసి వస్తుందని, తప్పనిసరిగా హాల్లోకి ప్రవేశించాను. పాపం- రమణ బీచిలో నాకొరకని ఎదురు చూస్తూంటాడనే బాధతో సినిమా ఏం చూశానో అర్థం కాలేదు. ఆరోజు ఎలా గడిచిందో కన్నీటితోతడిసి పోయిన నా దిండుకే తెలుసు. ఆమర్నాడు సాయంత్రం నాన్నగారికేదో పనుండి బీచి ప్రయాణం ఆపుకున్నారు. అది విన్న నాకు, ఏడుపు, కోపం, ఈర్ష్య యింకా ఏమేమో ముప్పిరికొన్నాయి—ఏమిటీ తికమకలు? ప్రేమా ప్రేమికుల మధ్య యిలాంటి అవాంతరాలెందుకు వస్తాయి? ఇలా మేం బాధపడుతూంటే చూసి సంతోషించటమేనా యీ భగవంతుడనే వాడికి ప్రీతి; కాకపోతే ఎన్నడూ లేని పరిస్థితుల్ని యిప్పుడే ఎందుకు కల్పించాలి- రమణని నిన్న కల్సుకోక పోయినందుకే ఎంతో బాధపడి వుంటాడు-

మళ్ళీ యీరోజు గూడా——! వచ్చే ఏడ్పునంతా దిగమింగి ఎలాగో ధైర్యంచేసి అమ్మను పురిగొల్పాను యిరువురమూ, బీచికి వెళదామని. ఆమె రావటానికి ఒప్పుకోలేదు. నా పోరుకి విసిగిపోయింది కాబోలు. నన్ను ఒక్కదాన్నే వెళ్ళి త్వరగా రమ్మన్నది. ఇక అప్పటి నా ఆనందాన్ని చెప్పాలంటే మా అమ్మని ఎన్నిసార్లు ముద్దుపెట్టుకున్నానో లెక్క చూస్తేగాని తేలదు. అంతవరకు నిందించబడుతున్న భగవంతునికి నారెండు చేతులే కాకుండా, యింకా అవకాశం వుంటే ఎక్కడయినా మరి పది చేతులు అప్పుతెచ్చుకుని ఒక్కసారిగా నమస్కారం చేద్దామనుకొని, లాభం లేక నా రెండు చేతులతోనే యిరవైసార్లు నమస్కారం చేశాను.

"కారు దిగిన తరువాత నా కాళ్ళు ఆ ఇసుకలో అంత త్వరగా ఎలానడిచాయో గాని, అతి సల్పకాలంలోనే మా నియమిత స్థానాన్ని చేరాను. చిరునవ్వుతో వికశిస్తున్న రమణ ముఖమే తానంతవరకు మీరాక కొరకని ఎదురు చూస్తున్నట్లు తెలిపింది. నేను కూర్చున్నానో లేదో ! నాకు తెలియకుండానే చిరునవ్వొకటి నా పెదవులపైన చిందులు త్రొక్కింది. దానికి వంతగా రమణ రెండుకండ్లు మెరశాయి. ఆనందంతో నా వంటరితనం, అతని ప్రేమ కొలను గట్లను పగులగొట్టింది కాబోలు – ఎన్నో రోజుల నుండి ఆకొలనులో అంచలంచలుగా చేరిన, అనురాగం, ఆనందం – ఆ గట్లనుదాటి ప్రవహించాయి – ఆ ప్రవాహం లోనే అతను తేలిపోయి, నాకు రెండు అడుగుల దూరంగా కొట్టుకొచ్చాడు. నన్ను సమీపించటంతోనే, ఏవో రెండు మాటలు అతని పెదవుల్ని పగుల గొట్టుకొని వచ్చాయి. 'ఏమిటీ' అర్ధం కాలేదన్నట్లు అతనివైపు మరొసారి చూశాను – అతను నా ప్రక్క కూర్చుంటూనే 'మీరు ఒక్కరే వచ్చారు ....? నిన్నమీరు' – అనే మాటలు తడ బడుతూ వినిపించాయి అస్పష్టస్వరంతో – దానికి సమా ధానం ఏమో చెప్పాలనుకున్నాను కాని ఒక్కమాటైనా పెగలి రాలేదు బైటకు-అలానే ఒక క్షణకాలం మాయిరువురి మధ్య నిశబ్దం పాదుకొన్నది. యింతలోనే, అతని రెండు కండ్లు నా చేతిమీద పడ్డాయి. అది గమనించిన నేను – ఎలాగో 'ఈ వుంగరం – బాగుందా?' అన్నాను – అంత వరకూ నా మాటకొరకని వేచివున్న అతను – పట్టలేని ఆనందంతో — 'అవుంగరంకన్నా ఆచేయి – ఆ వ్రేలు ఎంతో బాగుంది' అంటూ అతనిచేయి నాచేతి మీదకు వచ్చింది – ఆ స్పర్శతో నాలో ఏదో అనిర్వచనీయమైన మార్పు వచ్చింది. నాచేతి నాలుగు వ్రేళ్ళని ఏంతో ఆప్యాయంగా పట్టుకొని, తన పెదవులవైపు .... వెంటనే ప్రక్కనవున్న కొన్నికాకులు పక్కున నవ్వాయి – మానవ స్వరంతో – దానితో ఏదో తెలియని ఆవేశం – క్రోధం – ఒక్కసారిగా ఆవరించినై – ఏదో పైశాచికశక్తి నాలో ప్రవేశించింది. నేనెక్కడున్నానో ! ఏంచేస్తున్నానో, ఏం జరిగిందో గూడా తెలియలేదు. కాని 'చళ్' – అనే శబ్దం మాత్రం నాచెవుల్లో మారుమ్రోగింది. రమణచేయి – అవ మానంతో చెంప పట్టుకుంది. అతని చెంపతో పాటు, నా చేయిగూడ ఎర్రబడింది. ఇరువురం ఆలాగే కొంత వరకు స్థంబించి పోయాం. యింక అక్కడుండలేక ఇంటికివచ్చాను- అదే ఆఖరిఘడియ. ఆ మరునాటి నుండి బీచికి వెళ్ళటం మానుకున్నాను. ప్రతిరోజు సాయత్రం ఆ ఘడియ వచ్చి నప్పుడల్లా ఆ బీచికోలాహలం – ఆ నవ్వులు – అవ మానంతో కృంగిపోతున్న అతని ముఖం గుర్తుకు వస్తూండేవి – ఏదో అర్ధంకాని బాధ ఆవురించి అలమ టింపజేసేది. అతనెంతో ప్రేమతో – అప్యాయంగా చేతి వ్రేళ్ళను పట్టుకొని – అంతమాత్రాన – ఏమో తెలియకుండా అతని హృదయాన్ని గాయపర్చాను – అంతవరకు అతనికి నా సర్వస్వాన్ని అర్పించ తలచుకుంటున్న నాలో ఆ పైశాచిక శక్తి ఎందుకు ప్రవేశించింది—? పాపం అత నెంతగా బాధపడ్డాడో ! అతన్ని కల్సుకొని తప్పుక్షమించ మని ప్రాధేయ పడదామని, రెండుసార్లు బీచికివెళ్ళి అంతా కలయజూచాను. కాని – నిరాశ. ముఖ్యస్నేహితులద్వారా, అతను, బీచినే కాకుండా, ఆ వూరునే విడచి వెళ్ళాడని తెలుసుకొన్న తరువాత నాకు లోకమంతా చీకటైపోయింది. ఆనాటినుండి ఎలా కాలం గడుపుతున్నానో వాడిపోయిన నా తీవెలకే తెలుసు. నా దీనావస్థను బుజ్జగిస్తూ అడిగే తల్లి దండ్రుల ప్రశ్నలకు ఏదో సమాధానం చెప్తూండేదాన్ని. ప్రతిరోజూ నా పాటలువిని ఆనందించే తల్లిదండ్రులు యిప్పుడా ఆనందాన్ని పొందలేక పోతున్నారు. నా స్పర్శ లేక బూజు పట్టిపోతున్న వీణని చూస్తున్నప్పుడల్లా నాన్న, అమ్మ కంటి నిండా నీరు నింపుకొనేవారు – ఆ సమయం లోనే నా పెండ్లి – సంబంధం వచ్చింది – దానికి నాన్న, అమ్మగార్లు చాలా సంతోషించారు. నిజానికి నాకు పెండ్లి ఆశ పూర్తిగా పోయింది- కాని నాన్న, అమ్మగార్లను యీ రూపానైనా సంతోషింప చేసినదాన్ని అవుతానేమోననే ఆశతో పెండ్లికి ఒప్పుకున్నాను. పరిచయంలేని మరొక వ్యక్తికి అర్పించబోతున్న నా శరీరాన్ని గురించి —

## వింత జంట

చిస్తూ మా చిన్న నాన్న గారింట్లో పూల చెట్ల పాదుల్ని బాగుచేస్తున్న నాకు నా మధురమూర్తి - "అలా అంటూనే చేతిలో వున్న పాపవైపు చూస్తూ- యింకా ఏమో చెప్ప బోతున్న ఆమెకు చిన్నపాప ఏడ్పు అడ్డొచ్చింది. అంత లోనే రమణ పిల్ల వాణ్ణి తీసుకుంటూ "చెంప పగిలి పోతుందిరోయ్" అన్నాడు, రాధ ముఖంలోకిచూస్తు. రాధ సిగ్గుతో "చాల్లెండీ !" అంటూ పిల్లవాణ్ణి అందించి స్నేహితురాండ్రతో గదిలోకి వెళ్ళింది.

ఆ జంటను గురించి అనుకున్నప్పుడల్లా నవ్వుకుంటుం టాం - అలాంటి జంటజీవితం క్షణమైనా.......


మీరందరు తప్పకుండా
చదివి తీరాల్సిన పుస్తకం !

# జాజిమల్లి

(ఆంధ్ర మహిళలో సీరియల్‌గా ప్రచురింపబడిన నవలానిక)

గ్రంథకర్త :

కీ. శే. కులపతి అడివి బాపిరాజుగారు

150 పేజీలు :: వెల 1-8-0

ప్రతులు దొరుకుస్థలము :

హిగ్గిన్‌బాదమ్స్ అన్ని బుక్‌స్టాల్సు,
వెంకట్రామా అండ్ కో.,
ఆంధ్ర మహిళా ప్రెస్, మద్రాసు-4.



# రీటా హెయిర్ టానిక్
## తల వెంట్రుకలను పెంచును



రీటా కుదుళ్లకు బలమునిచ్చి, నిగనిగలాడు నిడుపాటి వెంట్రుకలను పెంచుటకు అద్భుతమైన హెయిర్ టానిక్.

తల వెంట్రుకలు రాలుట, నెరయుట, చుండ్రు, బట్టతల, పేను కొరకు, ఇంకను తల వెంట్రుకలకు సంబంధించిన సమస్త వ్యాధులకు రీటా అమోఘముగ పనిచేయును. వేలకువేలువాడి గుణమును పొంది యున్నారు. మీరుకూడా నేటినుండియే రీటా వాడుడు. రీటా హిందూదేశ మంతటా దొరకును.

వెల : సీసా 15 అణాలు.

**RITA**
**HAIR TONIC**

